క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పెద్దమ్మ తల్లీ దీవించు అంటూ అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కాశీవిశ్వనాథుడికి వెన్నాభిషేకం



నంద్యాల(వ్యవసాయం): సంజీవనగర్‌లో రామాలయంలో వెలసిన శ్రీ కాశీ విశ్వేశ్వరుడికి శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం వెన్నాభిషేకాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ఉదయాన్నే పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, గంధాభిషేకం నిర్వహించి అనంతరం వెన్నతో అభిషేకించి డ్రైఫ్రూట్స్‌తో అలంకరించారు. సభ్యులు సూరయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో స్వాతి వేడుకలు



పట్టణంలోని శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే స్వామి వారికి పంచామృత అభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. శ్రీలక్ష్మి దేవి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన చేపట్టి మహా నైవేద్యం సమర్పించి, మంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



సైన్స్ ఫేర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రభుత్వ బాలయోగి గురుకుల బాలికల కళాశాల (ఆర్పీఆర్పీ)లో ఆదివారం ప్రిన్సిపాల్ సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ విద్యార్థినులు నమూనాలను తయారు చేశారు.

చదరంగం విజేతలకు బహుమతులు



ట్రోఫీలు, పతకాలతో విజేతలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వాహణలో జిల్లా స్థాయి చదరంగం పోటీల విజేతలకు ఆదివారం పతకాలు, ట్రోఫీలు అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. వివిధ కేటగిరీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. నంద్యాల జిల్లా స్థాయి విజేతగా సలీం, మణికుమార్, షేక్ అద్నాన్ అమీన్, దీక్షశ్రీ, యుగంధర్ నిలిచారన్నారు. సుబ్బయ్య, నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి నాగరాజు, కోచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఈనెల 23వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీలకు నంద్యాలకు చెందిన శాంతినికేతన్ విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల చైర్మన్ సుధాకర్ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ పోటీల్లో క్రాంతినగర్ శాంతినికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. చరణ్, మనీష్, జగన్‌మోహన్‌రెడ్డి, ఓబులేసు, ధర్మసాయితేజ, లక్ష్మిశశిధర్, రేవంత్, గౌతమ్, లక్ష్మిచైతన్య, భరత్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి ఎంపికైనట్లు వివరించారు.

పోలీసుల అదుపులో హంతకులు?

శిరివెళ్ల: కోటపాడులో శనివారం వెలుగు చూసిన ఓ మృతదేహం కేసు విషయంలో ఇద్దరు నిందితులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గోస్పాడు మండలం యాళ్లురుకు చెందిన బాల మద్దిలేటిది హత్యేనని పోలీస్‌లు ఓ నిర్ధారణకు వచ్చారు. కోటపాడుకు చెందిన ఓ మహిళ, అమె అన్నదమ్ములు హత్య చేసి వరిగడ్డి వామి వద్ద పడేసి వెళ్లినట్లు సమాచారం. నిందితులు యాళ్లురుకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు.

జగనన్నను మళ్లీ గెలిపిద్దాం

చాగలమర్రి: అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చక్రం ముల్లా షబ్బీర్ అన్నారు. ఆదివారం స్థానిక 5వ సచివాలయం పరిధిలోని 19వ వార్డు గుంతపాళెం వీధిలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. సచివాలయ గృహసారథులు లైటింగ్ మహబూబ్‌పీరాన్, ఆరీఫ్, తొమ్మండ్రు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

రాయలసీమకే తలమానికం

- సర్వాంగ సుందరంగా అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం
- 1999లో రాజస్థాన్ గ్రానైట్‌తో చాగలమర్రిలో ఏర్పాటు
- ఏకశిల పదునెట్టాంబడితో ఖ్యాతి
- శబరిమలకు వెళ్లలేని వారు ఇక్కడే ఇరుముడి సమర్పించుకునే అవకాశం





చాగలమర్రిలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం,(ఇన్‌సెట్)అయ్యప్పస్వామి మూలవిరాట్

చాగలమర్రి: రాయలసీమకే తలమానికంగా నిలుస్తోంది మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి కోవెల. స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయానికి సమీపంలో 1999లో భక్తుల విరాళాలతో రాజస్థాన్ గ్రానైట్‌తో నిర్మించారు. ఆలయ నిర్మాణంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఏకశిల పదునెట్టాంబడితో సర్వాంగ సుందరంగా, ప్రశాంతమైన వాతవరణంలో ఆర్యవైశ్యులు నిర్మాణం చేపట్టారు.

1999 మే2న..

ఆలయాన్ని 1999 మే నెల 2న శబరిమలై సన్నిధాన ప్రధాన అర్చకులు శ్రీ కంఠరారు మోహనారుగారు, పందళదేశపు ప్రస్తుత రాజ వంశీయులు రాజరాజ వర్మ, వేద పండితులు తాళ్లమాపురం వెంకటశేషయ్య, శిష్య బృందం.. గర్భగుడి, అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠకు తరలివచ్చారు.

విశిష్టత..

అయ్యప్పస్వామి మాల ధరించి 42 రోజుల దీక్ష పూర్తి చేసిన భక్తులు శబరిమలకు వెళ్లలేని పరిస్థితుల్లో ఇక్కడే ఇరుముడి సమర్పించుకోవచ్చు. ఇలాంటి విశిష్టత కలిగిన మరో ఆలయం గుంటూరు జిల్లాలోని ద్వారంపూడిలో ఉంది. ఆలయ ప్రారంభం నుంచి ఏటా కార్తీకమాసం నుంచి మాలాధారణ చేసిన భక్తులకు అన్నదానంతో పాటు ఇతర ప్రత్యేక వసతులను అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.



భిక్ష స్వీకరిస్తున్న మాలాధారులు



ఆలయంలో నిర్మించిన ఏకశిల పదునెట్టాంబడి

ఏటా 200 మంది దీక్ష స్వీకరిస్తారు

నంద్యాల, వైఎస్సార్ జిల్లాలకు చెందిన భక్తులు ప్రతి ఏడాది సుమారు 200కు పైగా అయ్యప్పాస్వామి దీక్ష స్వీకరిస్తారు. వీరికి కావలసిన సౌకర్యాలన్నీ ఇక్కడ ఏర్పాటు చేశాం. కార్తీక మాసంలో భిక్ష ఉంటుంది. దీక్ష పూర్తయిన వారు శబరి వెళ్లలేకపోతే ఇరుముడి ఇక్కడే సమర్పించి స్వామిని వారిని దర్శించుకుంటే శబరిలో దక్కిన ఫలితంత లభిస్తుంది.

– పోరుమామిళ్ళ ప్రతాప రాయుడు, గురుస్వామి

మాలధారులకు భోజన వసతి కల్పిస్తాం



మాలాధారణ చేసిన వారికి కార్తీక మాసం ప్రారంభం నుంచి 60 రోజుల పాటు అంటే జనవరి 15 వరకు సుమారు 50 వేల మంది భక్తులకు అన్నదానం చేస్తాం. ఏటా స్వామి వారి దీక్ష స్వీకరించే వారికి ఇక్కడ అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– లక్ష్మీనారాయణ, అయ్యప్ప సేవా సమాజం ప్రధాన కార్యదర్శి

భక్తుడికి మాలాధారణ చేస్తున్న గురుస్వామి →



నేడు స్పందన

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని, అక్కడ సమస్యలకు పరిష్కారం లభించకపోతే మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో అర్జీలు అందజేయాలని సూచించారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల: ఈ నెల 12వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఏంపీపీ నాయక్ వసీం అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని కోరారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

పిల్లలను బడిలో చేర్పించడంలో జాతీయ స్థాయిలో నంద్యాల ముందంజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(న్యూటౌన్): బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాతీయ స్థాయి ముందంజలో ఉందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ఖాదరబాద్ నర్సింగరావు స్మారక ఉన్నత పాఠశాల ఆవరణలో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్ అండర్–14, 17 త్రోబాల్, ఫెన్సింగ్ క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బడిబయటనున్న పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, కౌన్సిలర్ తమీమ్, సలాముల్లా, పడకండ్ల సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎం అసదుల్లాహుసేన్, గోపాల్, రాష్ట్ర అబ్జర్వర్ ఈరన్న, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి శివకుమార్, రవికుమార్, ఎంఈఓ శ్రీనాథ్, డాక్టర్ ఉదయ్‌శంకర్, చిత్తలూరి రాంప్రసాద్ పాల్గొన్నారు.

తొలగిన మురుగు సమస్య



రుద్రవరం బలిజ కాలనీలో పూర్తయిన మురుగు కాల్వ నిర్మాణం



అగర్త కాలనీ వైపు నిర్మిస్తున్న మురుగు కాల్వ

రుద్రవరం: మండల కేంద్రలంఓని బలిజ, అగర్త కాలనీల్లో రూ.14లక్షలతో మురుగు కాల్వలు నిర్విచండంతో ఎన్నో ఏళ్లుగా ఎగువ వైపు నుంచి వచ్చే వర్షపు, వృథా నీరు చాకలి పేట, బలిజ కాలనీల మీదుగా ప్రధాన రహదారిపైనే పారేది. కాల క్రమేణా మురుగు నీరు ఇళ్లల్లోకి పారతుండేది. దీంతో ఆయా వీధులు దుర్గంధం వెదజల్లేవి. అలాగే దోమల బెడద తీవ్రంగా ఉండేది. దీంతో స్థానికులు అధిక శాతం రోగాలబారిన పడేవారు. సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీసీ రోడ్డును మరింత ఎత్తు పెంచి ఇరువైపులా మురుగు కాల్వలు నిర్మించారు. అప్పట్లో ఆయా కాలనీ వాసులు కొందరు అభ్యంతరాలు చెప్పడంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా కాలనీలకు వెళ్లినప్పుడు మురుగు సమస్య పరిష్కరించాలని కోరారు. వెంటనే గడప గడప నిధుల్లో నుంచి రూ.14లక్షలు కేటాయించారు. ఆ నిధులతో కాంట్రాక్టర్లు వెంటనే పనులు పూర్తి చేయడంతో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

సమాజ సేవలో ముందుండాలి



వనభోజనంలో పాల్గొన్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(అర్బన్): రెడ్డి సంఘాభివృద్ధితో పాటు సమాజ సేవలో ముందుండాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సూచించారు. స్థానిక భీమలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం నంద్యాల రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ వనభోజనాల కార్యక్రమంతో సంఘీయుల మధ్య ఆత్మీయత, అనురాగాలు పెంపొందుతాయన్నారు. సంఘాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినీ సింగర్ సాయికిరణ్ పాటలతో అలరించగా జబర్దస్త్ టీం సభ్యులు కామిడీ పండించారు. నాయకులు ఆర్‌వీసుబ్బారెడ్డి, సన్నల వెంకటరెడ్డి, తిరుపంరెడ్డి, సాయిరాంరెడ్డి, రాంపక్కీర్ రెడ్డి, సుధీర్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, వెంకటరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, బాచం నాగేశ్వరెడ్డి పాల్గొన్నారు.


పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

నంద్యాల(సిటీ): బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రవి చంద్రారెడ్డి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ షేక్.బషీరున్నిసా బేగం హెచ్చరించారు. ఆదివారం ఉదయం పెద్ద మార్కెట్‌లో వ్యాపారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ 5–18 సంవత్సరాల లోపు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలకు పంపాలని, వారితో పని చేయించుకోవడం చట్టరీత్యా నేరమన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

దొర్నిపాడు: మండల కేంద్రంలో ఆదివారం గుండె సంబంధిత వ్యాధులకు ఉదయానంద హాస్పటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. కార్డియాలజిస్టు రామేశ్వరరెడ్డి 176 మంది హృద్రోగులకు వైద్యచికిత్సలు నిర్వహించారు. ఈసీజీ, ఎకో వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు ఉన్నారు.

పూజాద్రవ్యాలతో గంగాధరుడు



కార్తీక మాసం వెలుగులతో పరమశివుడి చిత్రం

నంద్యాల(అర్బన్): కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా డ్రాయింగ్ చార్టుపై పసుపు, కుంకుమ, సింధూరం, గంధం వంటి పూజా ద్రవ్యాలతో పరమశివుడి చిత్రాన్ని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ గీచి కార్తీక శోభను చిత్రంలో చూపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(అర్బన్): సామాజిక, ఆధ్యాత్మిక క్షేత్రంలో వీరశైవ జంగమలను చైతన్యవంతులుగా చేస్తూ వారిలో ఆత్మాభిమానం నింపేందుకు సంఘం కృషి చేస్తుందని నూతన అధ్యక్ష కార్యదర్శులు నరేష్, హరినాథబాబు తెలిపారు. స్థానిక ప్రథమనందీశ్వర దేవాలయంలో ఆదివారం వీరశైవ జంగమ సంక్షేమ సంఘం ఆధ్యాత్మిక, ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరర్‌గా శంకరయ్య, గౌరవాధ్యక్షులుగా సావిత్రమ్మ, ఉమామహేశ్వరయ్య ఎన్నికయ్యారు.

సేవలు విస్తృతం చేయాలి

నంద్యాల(వ్యవసాయం): రాయలసీమలో లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలని జిల్లా గవర్నర్ నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక రామకృష్ణ పీజీ కళాశాలలో జరిగిన రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన లయన్స్ జిల్లా కేబినేట్ సమావేశానికి హాజరయ్యారు. ఆయన మాటాడుతూ గ్రామ ప్రజలకు విద్య, వైద్య,ఆర్థికంగా మరిన్ని సేవలను అందించాలన్నారు. క్లబ్ గవర్నర్‌లు డా. రవికృష్ణ, రామరాజు, బాలమద్దయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రజక సంఘాభివృద్ధికి కృషి చేయాలి

నంద్యాల(అర్బన్): రజక సంఘాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం నంద్యాల జిల్లా కార్యదర్శి రాము, నాయకులు పెద్ద తిమ్మయ్య కోరారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ కాలనీనున్న గంగమ్మ గుడి ఆవరణలో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహించారు. నాయకులు రంగనాయకులు, మధు, మల్లయ్య, నాగరాజు, జయరాం, బాదుల్లా పాల్గొన్నారు.

నివాళి

నంద్యాల(న్యూటౌన్): ఆదర్శ విప్లవ కమ్యూనిస్టు యోధుడు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ మాదాల నారాయణ స్వామి 10వ వర్ధంతిని ఆదివారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు అనే నినాదంతో పోరాటంలో పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామ చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అధ్యక్షుడు రఫి, ఐఎఫ్‌టీయూ నాయకులు చౌడప్ప,. మహమ్మద్ రఫి, ఖాజ, పఠాన్, బాలాజీ పాల్గొన్నారు.



క్రిష్టిపాడులో మిరప కోతలు కోస్తున్న కూలీలు,



కుందూ నది ఒడ్డున జోరుగా వరి కోతలు

కోతలు షురూ..

- ముమ్మరంగా మిరప, వరికోతలు
- సిరుల పంటలను ఇచ్చిన కుందూనది

దొర్నిపాడు: ఈ సారి కుందూనదిలో సాగునీరు రైతులకు పుష్కలంగా అందాయి. దీంతో రైతులు వరి, మిరప పంటలను విస్తారంగా సాగుచేశారు. కొద్ది రోజుల క్రితం మిచాంగ్ తుపాను కారణంగా కోతలను వాయిదా వేసుకున్నారు. ధాన్యం తడిసిపోతుందని ముందస్తుగా కోతలు కోయలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో మిరప, వరి కోతలను రైతులు షురూ చేశారు. వడ్లు కూడా ఎకరానికి 40 బస్తాలకు(75కిలోలు) దిగుబడి వస్తుండగా, బస్తా ధర రూ.2400 నుంచి రూ.2700 వరకు పలుకుతుండంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ తెగుళ్లు లేకపోవడం, మందుల వినియోగం తగ్గడంతో ఖర్చు తగ్గింది. అలాగే అనుకూల వాతావరణం కారనంగా దిగుబడులు అనుకున్నదాని కన్నా ఎక్కువగా వస్తున్నాయి. ఇక ఏటా పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా పైర్లు నేలవాలి నష్టాలు వచ్చేవి. ఈ ఏడాది అవి కూడా లేకపోవడంతో రైతులకు బాగా కలిసొచ్చింది. అలాగే మిర్చి కూడా తొలికాపు పంట చేతికి రావడంతో కోతలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కూలీలకు ప్రస్తుతం మిరప కోత పనులు మాత్రమే లభిస్తున్నాయి.

ఆళ్లగడ్డ.. అభివృద్ధికి అడ్డా



వెంకటాపురంలో లబ్ధి పొందిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధికి అడ్డాగా మారిందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రూ. 21 లక్షల జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీ నిధులతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు రెండేళ్ల కితం గ్రామాన్ని నూతన పంచాయతీగా మార్చామన్నారు. గ్రామంలో 95 శాతం సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు రూ. 45 లక్షలు మంజూరయ్యాయన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి నాలుగున్నర ఏళ్లలో అందిన ప్రభుత్వ పథకాల లబ్దిని ప్రజలకు వినిపించారు. గ్రామంలో ఎంతో మంది యువకులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలను పొందారన్నారు. యువతకు ఆదర్శంగా గ్రామం నిలిచిందన్నారు. ప్రజలకు మేలు చేసినందునే తాము ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలుగుతున్నారు. రానున్న ఎన్నికలలో ఓట్లు అడిగే హక్కు తమకు మాత్రమే ఉందన్నారు. గత ప్రభుత్వ పనితీరు, మా ప్రభుత్వ పనితీరును బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. అర్హత ఉంటే చాలు పథకం మంజూరవుతుందని,లంచాలు, సిఫారసులు లేకుండా ప్రజలకు పథకాలు అందించిన ఘనత ఒక జగనన్నేకే చెందుతుందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు సిఫారసు ఉంటేనే మంజూరయ్యేవన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు కందుల మల్లేశ్వరి, ఉప సర్పంచు ఎల్లమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం, మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి, నాయకులు కందుల ప్రసాదరెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, నాగిరెడ్డి, యర్రగుంట్ల, వీరారెడ్డిపల్లె, బోయలకుంట్ల సర్పంచులు సుభహాన్, శివారెడ్డి, జింకల నాగన్న, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రైతన్నను ఆదుకోవాలి

నంద్యాల(వ్యవసాయం): రైతన్నను ఆపత్కాలంలో ప్రభుత్వాలు ఆదుకోవాలని, పంటలకు ధరలను రైతులే ధరలు నిర్ణయించేలా ప్రభుత్వాలు విధానాలను ప్రవేశపెట్టాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి కోరారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశంలో భాగంగా ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో రైతు కవనం పేరుతో కవి సమ్మేళనం ఆదివారం స్థానిక పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ దేశ ప్రజల కడుపు నింపుతున్న రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారు. ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కవులు బాలరాజు, మహబూబ్‌బాషా, రఫీ, సతీష్‌కుమార్, శేషఫణి, నీలకంఠమాచారి, బాలరాజు వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, వ్యథలపై కవితలను వినిపించారు. ఉపాధ్యక్షుడు మణిశేఖర్‌రెడ్డి, మధుసూదన్, వెంకటరాముడు, గోపాల్, రైతులు శివనాగిరెడ్డి, ప్రతాపరెడ్డి, బాలకృష్ణుడు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం



నూతన సభ్యులతో ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(వ్యవసాయం): శ్రీకాళికాంబచంద్రశేఖర స్వామి దేవస్థానంలో శ్రీకాళిమాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో భక్తులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే రవిచంద్రకిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీ కాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానం నూతన కార్యవర్గ సభ్యుల అభినందన సభను ఆదివారం నిర్వహించగా వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాలకమండలి అధ్యక్షుడు ఆరవేటి వాసు, విజయ్ కుమార్, ప్రతాప్, లక్ష్మి, వరలక్ష్మి లింగమ్మ, నాగమణి బాయ్, వెంకటరమణాచారి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, వైస్ చైర్మన్ గంగిసెట్టి శ్రీధర్, ఖండేశ్యామ్ సుందర్‌లాల్, వేణుగోపాల్, సుబ్బలక్ష్మయ్య, పడకండ్ల సుబ్రమణ్యం, వెంకటసుబ్బయ్య, రమేష్, బొజ్జయ్య పాల్గొన్నారు.

పోటాపోటీగా వాలీబాల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ క్రీడా మైదానంలో ఆదివారం వాలీబాల్ పోటీలు పోటాపోటీగా సాగాయి. గుడ్ షపర్డ్ వాలీబాల్ ఫర్ క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పోటీలు ఏర్పాట చేశారు. పోటీలకు 8 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు డాక్టర్ మనోజ్‌కుమార్, కారు రవికుమార్, చర్చి ప్రేమ్‌కుమార్, విజయసాగర్ తెలిపారు. విజేతలకు రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.1500 అందజేశారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(అర్బన్): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుగుణశ్రీ అన్నారు. ఆదివారం మండలంలోని చాబోలు, అయ్యలూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మౌనిక, ఎంపీటీసీ దావీద్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, అయ్యలూరు సర్పంచ్ ఓబులేసులు సంకల్ప యాత్ర రథంకు ఆహ్వానం పలికారు. బాల్యవివాహాలు వద్దంటూ విద్యార్థినులు చేసిన నాట్యం ఆకట్టుకుంది. సంతత్ కృషి యాక్టివిటీలో భాగంగా వ్యవసాయంలో డ్రోన్ వినియోగాన్ని రైతులకు డెమో ద్వారా వివరించారు. కో ఆప్షన్ మెంబర్ పాలబాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగనందిరెడ్డి, అయ్యలూరు బసవేశ్వరరెడ్డి, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మాతృభాషను ప్రేమించాలి

నంద్యాల(అర్బన్): మాతృభాషను ప్రేమించాలని అల్ మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం అన్నారు. మండలంలోని కానాల గ్రామ మదరసా ఏ అరబిల్ హుదా పాఠశాలలో ఆదివారం నా సంతకం మాతృభాషలోనే కార్యక్రమం నిర్వహించారు.

హిందూ ధర్మం ఎంతో గొప్పది

దొర్నిపాడు: హిందూ ధర్మం, సంస్కృతి ఎంతో గొప్పదని గీతామందిరం జయదేవానందగిరి స్వామి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎరుకలస్వామి ఆలయ ఆవరణలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నంద్యాల(అర్బన్): ప్రాథమిక హక్కులపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని హ్యూమన్ రైట్స్ నంద్యాల జిల్లా చైర్మన్ సురేంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా ఆదివారం స్థానిక కార్యాలయంలో సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని టిడ్కో గృహ సముదాయల సమీపంలో చంద్రశేఖర్‌రెడ్డి అన్యే వ్యక్తి పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. చింతకుంటకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పట్టణానికి వస్తుండగా టిడ్కో గృహ సముదాయల సమీపంలో చీకట్లో ముసుగులు వేసుకుని వచ్చిన నలుగురు వ్యక్తులు దాడి చేసి పారిపోయారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.